సాక్షి
మంచిర్యాల
మంగళవారం । 2 । జనవరి । 2024



ట్రిపుల్.. ట్రబుల్స్ తీరేనా?

ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు లేక సమస్యలు పరిష్కారం కాక బాసర ట్రిపుల్ ఐటీలో చదివే విద్యార్థులు ఇప్పటికీ ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. 8లో▸



బాసరలో భక్తుల రద్దీ

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం బాసర సరస్వతి ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ నెలకొంది. 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
28.4 /16.3

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి ప్రభావం కాస్త తగ్గుతుంది. ఉదయం పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

భీమా కోరేగావ్ యుద్ధ వీరులకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో ఉన్న తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద భీమా కోరేగావ్ యుద్ధ వీరులకు సమతా సైనిక్‌దళ్, బహుజన సంఘాల నాయకులు సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మరాఠా పీష్వా బ్రహ్మణుల ఆరాచక పాశవిక అణిచివేత నుంచి విద్యకు, సమాజానికి, సంపదకు మానవ హక్కులకు దూరమైన జాతులకు మహార్ సైనికుల వీరోచిత పోరాటంతో స్వేచ్ఛ లభించిందన్నారు. 1818, జనవరి 1న పీష్వా బాజీరావు సైన్యంపై మహార్ సైన్యం పోరాట ఫలితంగా పీష్వాల రాజ్యం అంతరించిందన్నారు. ఈ పోరాటంలో 28 వేల పీష్వా సైన్యాన్ని 500 మంది మహార్ సైనికుల ఓడించిన భీకర పోరాటం అన్నారు. ఈ సందర్భంగా అమరుల స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో దుర్గం స్వామి, మహ్మద్ షాకీర్, దుర్గం ఎల్లయ్య, దేవి పోచన్న, పరిగిరి కనకరాజు, దుర్గం తులసీరాం, రంగు రాజేశం పాల్గొన్నారు.

కాసిపేటలో..

కాసిపేట: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీమా కోరేగావ్ విజయ దివస్ నిర్వహించారు. అమరవీరుల స్మారక స్తూపం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ యువజన సంఘం మండల కన్వీనర్ జాడి పోశం, తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంట సత్యం మాట్లాడుతూ అమరుల జీవిత చరిత్రను గుర్తుచేశారు. కార్యక్రమంలో సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు పల్లె మల్లయ్య, ప్రధానకార్యదర్శి కొమ్ముల బాపు, టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోనెల శ్రీనివాస్, సీపీఐ నాయకులు పులి శంకర్, లంక లక్ష్మణ్, దాసరి రాంచందర్, ఉప్పులేటి మధునయ్య, కుర్మ నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేలిన హైడ్రోజన్ సిలిండర్

- మహిళకు తీవ్ర గాయాలు
- మంచిర్యాలలో ఘటన



ప్రమాదంలో గాయపడిన మహిళా కూలీ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఏసీసీ సమీపంలో సూర్య ఫైర్ అండ్ సేఫ్టీ కంపెనీలో సోమవారం హైడ్రోజన్ సిలిండర్ పేలింది. ఈ ఘటనలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. వివరాల్లోకి వెళ్తే స్థానిక ఏసీసీ సమీపంలో దినాకర్ అనే వ్యాపారి అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు మంటలు ఆర్పే హైడ్రోజన్ సిలిండర్ రీఫిల్లింగ్ స్టేషన్ స్థాపించాడు. ఇందులో ఆరుగురు కూలీలు పనులు చేస్తున్నారు. సోమవారం ఇద్దరు మహిళా కూలీలు విధులకు హాజరై సిలిండర్లలో హైడ్రోజన్ ఫిల్ చేసే పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ సిలిండర్‌లో హైడ్రోజన్ ఎక్కువ కావడంతో ఒక్కసారిగా పేలిపోయింది. ఈ ఘటనలో సిలిండర్ నింపుతున్న స్వప్న అనే మహిళ తీవ్రంగా గాయపడింది. మరో మహిళకు స్వల్పంగా గాయాలయ్యాయి. సమీపంలోని వారు భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించారు. గాయపడిన స్వప్నను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై జిల్లా ఫైర్ అధికారి అజయ్‌బాబును వివరణ కోరగా ఫైర్ డిప్లామా చేసిన వారు ఫైర్ అండ్ సేఫ్టీ సిస్టం కంపెనీ ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.



హైడ్రోజన్ పొగతో నిండిపోయిన దృశ్యం

మళ్లీ బదిలీలు!



- లోక్‌సభ ఎన్నికల ముందు స్థానచలనం
- నిబంధనలతో కొందరికి తప్పని ట్రాన్స్‌ఫర్లు
- నచ్చిన చోట పోస్టింగ్ కోసం కొందరి ప్రయత్నాలు
- 'సిఫారసు'లు కావడంతో ఖాకీల ఇతర ప్రయత్నాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికల ముందు జిల్లా అధికారుల్లో మళ్లీ బదిలీల టెన్షన్ మొదలైంది. గత అసెంబ్లీ ఎన్నికల ముందు పోలింగ్ విధులతో ప్రత్యక్షంగా సంబంధం ఉన్న పలుశాఖల అధికారుల బదిలీలు జరిగాయి. ఇందులో పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల్లోని అధికారులతోపాటు ఇతర అధికారులు ఉన్నారు. ఏప్రిల్‌లో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధనల ప్రకారం మళ్లీ కొందరికి బదిలీలు జరిగే అవకాశం ఉంది. జిల్లా పరిధిలో మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి స్థాన చలనం తప్పదు. రిటైర్మెంట్‌కు ఆరు నెలల ముందున్న వారికి సైతం నిబంధనల ప్రకారం ఎన్నికల విధుల్లో పని చేయరాదు. సొంత జిల్లాతోపాటు గడిచిన నాలుగేళ్లలో జూన్ 24 నాటికి మూడేళ్లు నిండిన వారందరికీ బదిలీ జరగాలి. వివిధ శాఖల అధికారుల నిబంధనల ప్రకారం బదిలీలు చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని గత నెలలోనే ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో స్థాన చలనం కోరుకుంటున్న వారితోపాటు తప్పనిసరి బదిలీ అయ్యే అధికారులు సర్దుకుంటున్నారు.

రెవెన్యూలో ముగ్గురికి గండం..

జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు తహసీల్దార్ స్థాయి అధికారులకు ఎన్నికల ముందు బదిలీ అనివార్యంగా మారింది. ఇందులో ఇద్దరు ఆరు నెలల్లో ఉద్యోగ విరమణ చేయబోతున్న అధికారులు కాగా, ఒకరికి మూడేళ్ల సర్వీసు పూర్తికానుంది. ఈ ముగ్గురిలో ఇద్దర్ని స్థానికంగానే తహసీల్దార్ హోదా కాకుండా సూపరింటెండెంట్‌గా పోస్టుల్లో సర్దుబాటు చేయొచ్చు. మరొకరిని బదిలీ చేయక తప్పదు. ఇక కలెక్టరేట్‌లో బీ, సీ, డీ విభాగాల్లో ఏళ్లుగా పాతుకుపోయిన ముగ్గురు తహసీల్దార్లను కదిలిస్తే కొంత మేర సర్దుబాటయ్యే అవకాశం ఉంది. వీరిని ఇతర చోట్ల సర్దుబాటు చేస్తారా? లేక మండలాలు, ఆర్డీవో ఆఫీసులో ఉన్న వారిని బదిలీ చేస్తారా? అనేది తేలాల్సి ఉంది. వీరితోపాటు జిల్లా పరిధిలో పనిచేస్తున్న ఆబ్కారీ, కమర్షియల్ ట్యాక్స్, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు ఇతర అధికారులకు ఎన్నికల నియమావళి వర్తిస్తుంది. ఇటీవల రవాణా శాఖలో ఓడీ (ఆన్ డ్యూటీ) రద్దు చేయడంతోనూ ఎక్కడి వారు అక్కడే పని చేయనున్నారు.

సిఫార్సులు చెల్లవా?

ఎన్నికల విధుల్లో కీలకమైన పోలీసు శాఖలోనూ కొందరికి స్థాన చలనం తప్పకపోవచ్చు. శాసన సభ ఎన్నికల ముందు రామగుండం కమిషనరేట్ పరిధిలోపాటు ఆసిఫాబాద్, ఇతర జిల్లాలకు కొందరు సీఐ, ఎస్సైలు ఇతర చోట్ల కదిలారు. కొందరు ఆయా ఠాణాల పరిధిలోనే ఉన్నారు. ఇంకొందరు అయిష్టతతోనే ఆయా స్టేషన్లలో పని చేస్తున్నారు. ప్రస్తుత బదిలీల్లో తాము కోరుకున్న చోటుకి పోస్టింగ్ తెచ్చుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. ఈమేరకు కొందరు పోలీసు అధికారులు ముఖ్య ప్రజాప్రతినిధుల వద్దకు బదిలీ ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీనియార్టీ, ప్రతిభను పక్కకు పెట్టి కేవలం సిఫారసు లేఖలతోనే బదిలీలు చేసిందన్న ఆరోపణలు ఉన్నాయి. కాంగ్రెస్ సర్కారు సిఫారసులకు ప్రాధాన్యం ఇవ్వదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ క్రమంలో పారదర్శకంగా బదిలీలు జరుగుతాయని చాలా మంది భావిస్తున్నారు. అయినా కొందరు తమకు నచ్చినచోట పోస్టింగ్ కోసం కీలక నేతల వద్దకు క్యూ కడుతున్నారు.

దసరాను మించిన 'కొత్త' కిక్కు



ఆదివారం రాత్రి న్యూ ఇయర్ వేడుకల్లో యువకులు



- మూడు రోజుల్లో రూ.21.03 కోట్ల మద్యం అమ్మకాలు
- అదే స్థాయిలో మాంసం..
- పెరిగిన కేకుల విక్రయాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కొత్త సంవత్సరం కిక్కు.. జిల్లాలో దసరా పండుగను మించిపోయింది. 2023కు వీడ్కోలు పలికి.. 2024కు గ్రాండ్‌గా వెల్‌కమ్ చెప్పిన జిల్లా వాసులు జోష్‌లో ఎక్కడా తగ్గలేదు. చిన్న పెద్ద అని తేడా లేకుండా అందరూ వేడుకల్లో భాగస్వాములయ్యారు. దీంతో జిల్లాలో కేక్‌ల నుంచి మొదలు, మద్యం, మాంసం వరకు అమ్మకాలు జోరుగా సాగాయి. డిసెంబరు 31న ఉదయం నుంచి మొదలైన వివిధ అమ్మకాలు జనవరి 1వ తేదీ సాయంత్రం వరకూ జరిగాయి. దేనికీ వెనుకాడకుండా డబ్బులు నీళ్లలా ఖర్చు చేసి మరీ సంబురాలు చేసుకున్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలతోపాటు కోల్‌బెల్ట్ పరిధిలోని మందమర్రి, సీసీసీ, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి, తాండూర్ తదితర ప్రాంతాల్లో కొత్త సంవత్సర వేడుకలకు రూ.30 కోట్లపై ఖర్చు చేసినట్లు సమాచారం. మద్యం, మాంసం భోజనాలు, పార్టీలు, బేకరీల్లో కేక్‌లు, మిఠాయిల కొనుగోళ్లతోపాటు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి వివిధ రకాలుగా ఖర్చు చేశారు. ఇళ్ల ముందు ముగ్గులు వేయడానికి అవసరమైన రంగులకు, డైరీలు, క్యాలెండర్ల కొనుగోలు తదితర వాటికి కూడా ఖర్చులు చేశారు. దసరా పండుగను కొందరు మాత్రమే జరుపుకుంటారు. కుల మతాలకు అతీతంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. దీంతో వ్యాపారాలన్నీ జోరుగా సాగాయి.

జోరుగా మాంసం అమ్మకాలు..

కొత్త సంవత్సరంలో మద్యంతోపాటు మాంసం అమ్మకాలు జోరుగానే జరిగాయి. చికెన్, మటన్, చేపల అమ్మకాలు ఈ ఏడాది పెద్ద ఎత్తునే జరిగాయి. మాంసం అమ్మకాలు ఒక్క జిల్లా కేంద్రమైన మంచిర్యాలలోనే 100కు పైగా చికెన్, 50కి పైగా మటన్ దుకాణాలు ఉండగా జిల్లా మొత్తంగా ఉన్న వందలాది దుకాణాల్లో పెద్ద ఎత్తున వ్యాపారం జరిగింది. మంచిర్యాల, సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతాల్లోనే కాకుండా జిల్లాలో మొత్తంగా దాదాపు రూ.2 కోట్లకు పైగా వ్యాపారం జరిగినట్లు తెలుస్తోంది.

ఇటు కేక్‌లు.. అటు మిఠాయిలు..



నూతన సంవత్సరంలో ముఖ్యంగా మిఠాయిలు, బేకరీ దుకాణాలు కిటకిటలాడాయి. వీటితో పాటు హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, వస్త్ర దుకాణాలు, ఎలక్ట్రానిక్, హోం అప్లయెన్సెస్, మోటార్ దుకాణాల్లో వ్యాపారం జోరుగా సాగింది. నూతన సంవత్సరం సందర్భంగా మంచిర్యాల జిల్లాలోని బేకరీల్లో సుమారుగా రూ.50 లక్షల విపులైన కేక్‌ల అమ్మకాలతోపాటు కూల్‌డ్రింక్స్ అమ్మకాలు జరిగాయి. ఇళ్ల ముంగిళ్లలో రంగులతో ముగ్గులు వేయడానికి జిల్లాలో రూ.2 లక్షల విలువ గల రంగులు వాడినట్లు తెలుస్తోంది. శుభాకాంక్షలు తెలపడానికి పూలు, బొకేలు, రాత్రి కాల్చడానికి బాణాసంచాలు, మిఠాయిలు తదితర వాటికి పెద్ద మొత్తంలోనే ఖర్చు చేశారు. మొత్తంగా న్యూ ఇయర్ సంబురాలు ఈసారి దసరా కన్నా ఘనంగా జరిగాయన్న చర్చ జరుగుతోంది.

రూ.21.03 కోట్ల మద్యం అమ్మకాలు..



నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఈ మూడు రోజుల్లోనే మొత్తంగా రూ.21.03 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గుడిపేట లిక్కర్ డిపో పరిధిలోని 135 మద్యం దుకాణాలు, 25 బార్లకు పెద్ద ఎత్తున మద్యం సరఫరా జరిగింది. డిసెంబర్ 29వ తేదీన 4,329 లిక్కర్ కేసులు, 7,799 బీర్ కేసుల విక్రయాలు జరగగా వీటి విలువ రూ. 4.82 కోట్లు, 30వ తేదీన 9,164 లిక్కర్ కేసులు, 10,500 బీర్ కేసుల విక్రయాలు జరగగా వీటి విలువ రూ.9.74 కోట్లు. డిసెంబర్ 31వ తేదీన 6,030 లిక్కర్ కేసులు, 6,929 బీర్ కేసుల విక్రయాలు జరిగాయి. వీటి విలువ రూ. 6.47 కోట్లు. 29, 30, 31 తేదీల్లో మొత్తంగా రూ.21.03 కోట్ల అమ్మకాలు జరిగాయి.

కొత్త వేడుకల్లో కలెక్టర్



కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీ డెప్యూటీ సీఈవో, ఎంపీడీవోలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నూతన సంవత్సరం పురస్కరించుకుని కలెక్టర్ బాదావత్ సంతోష్‌ను సోమవారం పలువురు అధికారులు కలిశారు. పుష్ప గుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీ డెప్యూటీ సీఈవో లక్ష్మీనారాయణతోపాటు ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌హై, ఎంపీడీవోలు అలీం, మల్లేశ్, ప్రవీణ్‌కుమార్, నాగేశ్వర్‌రెడ్డి, జవహర్, శ్రీనివాస్, భాస్కర్, ఎంపీవో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి బాపూ, కోశాధికారి సఫ్దర్ అలీ, సభ్యుడు సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ నాన్ గజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో నాయకులు కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత టీఎన్‌జీవో భవనంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి భూముల రామ్మోహన్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాబురావు, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కేజీయా రాణి, సతీశ్, సంయుక్త కార్యదర్శి సునిత, ప్రభు, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రావణ్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, బెల్లంపెల్లి యూనిట్ అధ్యక్షుడు అంజన్న, కార్యదర్శి వెంకటేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మోషిన్, కుమార్, ప్రణవానంద్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

నూతన లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



నూతన సంవత్సర వేడుకల్లో కేక్‌కట్ చేస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

- సీపీ రెమా రాజేశ్వరి

మంచిర్యాలక్రైం: పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న అధికారులు మొదలుకుని క్షేత్ర స్థాయి సిబ్బంది వరకు శాంతి భద్రతల పరిరక్షణ కోసం నూతన లక్ష్యాలను నిర్దేశించుకుని పని చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి సూచించారు. కమిషనరేట్ ప్రాంగణంలో మంచిర్యాల, పెద్దపెల్లి జిల్లాల పోలీస్ అధికారులు, సిబ్బందితో సోమవారం న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నా రు. కేక్ కట్‌చేశారు. రెండు జిల్లాల పోలీస్ అధికారులు సీపీకి బొకేలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీపీ మాట్లాడుతూ గతేడాది పోలీస్ శాఖలో ఎన్నో నూతన ఒరవడులను, అధునాతన సాంకేతికతను అందించడమే కాకుండా సిబ్బంది సమర్థవంతంగా పనిచేయడానికి దోహద పడిందని తెలిపారు. పోలీసులు ప్రజల మధ్యనే ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించిన పోలీసులకు క్యాష్ రివార్డు అందజేశారు. కార్యక్రమంలో సీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏఆర్ అడిషనల్ డీసీపీ రియాజ్ ఉల్ హక్, ఏసీపీలు తిరుపతిరెడ్డి, మోహన్, తులా శ్రీనివాస్, మహేశ్, తిరుపతిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

సేవలకు దక్కిన గౌరవం



రఘునాథ్‌చౌహాన్, అసిస్టెంట్ కమాండెంట్, ఉత్తమ సేవా పతకం | రవి, ఆర్ఐ, ఉత్తమ సేవా పతకం | కె.నారాయణరెడ్డి, ఏఆర్ఎస్సై, ఉత్తమ సేవా పతకం | కొమురయ్య, ఏఆర్ఎస్సై, ఉత్తమ సేవా పతకం | జి.శ్యాంరావు, ఆర్ఐ, కఠిన సేవా పతకం | ఏ.గోపి, ఆర్ఐ, కఠిన సేవా పతకం

కంపెల్లి లింగయ్య | నీరటి రామరాజు | మామిడి రాజన్న | నీర్ల వేణుగోపాల్ | ఇఫ్తాకర్ హైమద్ | గంగ్య నాయక్

- కమిషనరేట్ పరిధిలో ఆరుగురికి.. బెటాలియన్‌లో ఏడుగురికి సేవా పతకాలు

మంచిర్యాలక్రైం: శాంతి భద్రతల పరిరక్షణలో నిస్వార్థంగా సేవలందించిన పోలీస్ అధికారులకు గౌరవం దక్కింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శౌర్య, ఉత్తమ సేవ, రాష్ట్ర సేవ, కఠిన సేవా పతకాలను ప్రకటించింది. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఆరుగురు పోలీస్ పతకాలకు ఎంపికయ్యారు.

బెటాలియన్ పోలీసులకు..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో పనిచేస్తున్న ఏడుగురు వివిధ పోలీస్ పతకాలకు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ కఠిన సేవా పతకానికి ఇద్దరు, పోలీస్ సేవా పతకానికి ఇద్దరు, ఉత్తమ సేవా పతకానికి ముగ్గురు ఎంపికయ్యారు. రాష్ట్ర పోలీస్ ఉత్తమ సేవా పతకాలకు బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్‌చౌహాన్, ఆర్ఐ సీహెచ్.రవి, ఏఆర్ఎస్సైలు కె.నారాయణరెడ్డి, జి.కొమురయ్య ఎంపికయ్యారు. వీరు రూ.30 వేల ప్రోత్సాహకం అందుకోనున్నారు. రాష్ట్ర పోలీస్ కఠిన సేవా పతకాలకు ఆర్ఐ జి.శ్యాంరావు, ఏ.గోపి ఎంపిక కాగా వీరికి రూ. 20 వేల ప్రోత్సాహం అందనుంది. రాష్ట్ర పోలీస్ సేవా పతకాలకు గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్‌బాషా, ఏఆర్ఎస్సై జి.దయానంద్ ఎంపిక కాగా వీరికి రూ. 20 వేల ప్రోత్సాహం అందించనున్నారు. జనవరి 26వ తేదీన గణతంత్ర దినోత్సవం సందర్భంగా పతకాలు ప్రదానం చేస్తారు. పతకాలకు ఎంపికైన వారిని బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ శరత్‌కుమార్, బెటాలియన్ ఆర్ఐలు, ఏఆర్ఎస్సైలు, పోలీస్, మినిస్టీరియల్ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

పేరు	హోదా	విధులు నిర్వహించే స్థలం
కంపెల్లి లింగయ్య	ఏఆర్ ఎస్సై	రామగుండం
నీరటి రామరాజు	ఏఎస్సై	ట్రాఫిక్ మంచిర్యాల
మామడి రాజన్న	ఏఎస్సై	తాళ్లగురిజాల
నీర్ల వేణుగోపాల్	హెచ్‌సీ	ట్రాఫిక్ రామగుండం
ఎండీ.ఇఫ్తాకార్ హైమద్	హెచ్‌సీ	లక్సెట్టిపేట
ఆజ్మీర గంగ్యనాయక్	హెచ్‌సీ	దండెపెల్లి



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్జీవో నాయకులు

మంచిర్యాలక్రైం: నూతన సంవత్సరం పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారులు సోమవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

బెటాలియన్‌లో సంబురాలు..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని గుడిపేట ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ జమీల్‌బాషా ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి కేక్, చాక్లెట్స్ పంపిణీ చేశారు. వేడుకల్లో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్‌లు రఘునాథ్ చౌహాన్, శరత్‌కుమార్, యూనిట్ మెడికల్ అధికారి డాక్టర్ శ్రీధర్, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



న్యూ ఇయర్ వేడుకల్లో కమాండెంట్ జమీల్‌బాషా, పోలీస్ అధికారులు

మున్సిఫ్ కోర్టులో..



జడ్జికి శుభాకాంక్షలు తెలుపుతున్న న్యాయవాదులు

లక్సెట్టిపేట: స్థానిక మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ న్యాయవాదులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కోర్టు ఆవరణలో పుష్పగుచ్ఛం అందించారు.

యెల్లో చిల్లీ.. సిరుల వల్లి

సిరులు కురిపించే యెల్లో మిర్చి సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ పంటకు డిమాండ్ ఉంటుంది. మొదటిసారి కుమురంభీం జిల్లాలో ఓ రైతు ఈ ఏడాది సాగు చేస్తున్నాడు. దహెగాం మండల కేంద్రానికి చెందిన ముడుపు రఘోత్తంరెడ్డి పసుపు రంగు మిర్చి సాగు చేస్తున్నాడు. - వివరాలు 10లో▸



క్లుప్తంగా

ఆరుగురిపై కేసు

జన్నారం: మండలంలోని తపాలపూర్‌కు చెందిన జెల్ల భీమయ్య ఇంటి ద్వారాన్ని పగులగొట్టి చంపుతానని బెదిరించిన ఆరుగురిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై బిక్‌లాల్ తెలిపారు. భీమయ్య ఫిర్యాదుతో నల్ల విజయ్‌కుమార్, వినయ్‌కుమార్, కవిత, శ్రీనివాసరెడ్డి, సరళ, సురేఖపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

ఇద్దరి మృతికి కారణమైన డ్రైవర్‌పై కేసు

కాసిపేట: డ్రైవర్ అజాగ్రత్తతతో వాహనం నడిపి ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నస్పూర్‌కు చెందిన వేల్పుల రవీందర్ భార్య నిర్మల, కూతురు స్వాతి ఆదివారం రాత్రి సోమగూడెం సమీపంలోని కల్వరి చర్చిలో ప్రార్థనలకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నారు. మహారాష్ట్రకు చెందిన డ్రైవర్ ఉరాడే భరత్ తన గూడ్స్ క్యారియర్ వాహనాన్ని అజాగ్రత్తగా వేగంగా నడుపుతూ వారిని ఢీకొట్టారు. తీవ్రగాయాలైన వారిని బెల్లంపల్లి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందారు. భర్త రవీందర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాపల్ ప్రాంతంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై చంద్రకుమార్ కథనం ప్రకారం.. బెల్లంపల్లి పట్టణానికి చెందిన కోటేశ్ మందమర్రి ఏరియాలోని కేకే–ఓసీలో క్లర్క్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఎప్పటిలాగా ఉదయం పని నిమిత్తం బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మందమర్రిలోని ఇందిరానగర్‌కు చెందిన మహేశ్ బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని 108 అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచనలతో కోటేశ్‌ను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోటపల్లిలో చిరుత సంచారం



ఆయిల్‌పాం తోటలో చిరుత పాదముద్రలు

కోటపల్లి: మండల కేంద్రానికి అనుకుని ఉన్న ఎంపీపీ సురేఖ ఆయిల్‌పాం తోట సమీపంలో చిరుతపులి సంచారంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. చెన్నూర్ మండలం బుద్దారం, సంకారం మీదుగా ప్రయాణం చేసి కోటపల్లి నుంచి శంకరాపూర్ మీదుగా వెళ్లి ఉంటుందని అటవీ అధికారులు భావిస్తున్నారు. రైతు రామయ్య సమాచారం మేరకు ఆయిల్‌పాం తోటకి వెళ్లి చిరుత పాదముద్రలను గుర్తించారు. అటుగా మామిడి తోటలు, పత్తి చేన్లకు వెళ్లాలంటే రైతులు జంకుతున్నారు. అటవీ అధికారులు చిరుతను పట్టుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ట్రిపుల్.. ట్రబుల్స్ తీరేనా?

- సీఎంనే ఆనాడు రానివ్వలేదు
- ప్రధాన గేటు ముందే గవర్నర్ మీడియా సమావేశం
- ఎవరొచ్చినా లోపలకు నో ఎంట్రీ
- ప్రధాన ద్వారం వద్ద ఆంక్షలు
- తల్లిదండ్రులకు మాట్లాడే చాన్స్‌లేదు
- సీఎం రాక కోసం విద్యార్థుల ఎదురుచూపులు



బాసర ట్రిపుల్‌ఐటీ

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ అంటే రాష్ట్రవ్యాప్తంగా అందరికీ తెలిసిందే.. ఇక్కడ చదివే పిల్లల ఇబ్బందులు, ఆందోళనలు, నిరసనలు ఇలా ఏదో ఒక విషయంలో ట్రిపుల్‌ఐటీ ఎప్పుడు వార్తల్లో నిలిచేది. బాసరలో 2008లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ట్రిపుల్‌ఐటీని ప్రారంభించారు. కొన్నేళ్లుగా ఇక్కడి విద్యార్థులు సమస్యల పరిష్కారానికి ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు లేక సమస్యలు పరిష్కారం కాక ఇప్పటికీ అక్కడ చదివే విద్యార్థులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. బాసర ట్రిపుల్ ఐటీ రహస్య క్యాంపస్‌గా మారింది. మీడియాకు, విద్యార్థి సంఘాలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, మేధావులకు ఎవరైనా సరే లోపలికి అనుమతించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు చదివే ఈ విశ్వవిద్యాలయంలో ఏమి జరుగుతుందోనని తెలియక పోషకులు ఆందోళనకు గురవుతున్నారు.

మీడియాకు నో ఎంట్రీ

2022 ఆగస్టు 7న బాసర ట్రిపుల్‌ఐటీకి గవర్నర్ హోదాలో తొలిసారి వచ్చిన తమిళిసై పర్యటన కవరేజీకి వెళ్లిన మీడియాను అధికారులు అనుమతించలేదు. ట్రిపుల్‌ఐటీ ప్రధాన ద్వారాన్ని మూసివేసి ఉంచారు. మీడియాతో పాటు ఉదయం వేళ ట్రిపుల్ ఐటీలో పనిచేసే సిబ్బందిని కూడా అనుమతించలేదు. గవర్నర్ బాసర ట్రిపుల్‌ఐటీ నుంచి నిజామాబాద్ తెలంగాణ యూనివర్సిటీకి వెళ్లే సమయంలో ప్రధాన ద్వారం వద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. అక్కడే మీడియాతో గవర్నర్ తమిళిసై మాట్లాడారు.

ఇప్పటికైనా మారేనా?

నాటి ప్రభుత్వంలో బాసర ట్రిపుల్‌ఐటీలో ఆంక్షల పేరుతో ఎవరిని అనుమతించలేదు. డిసెంబర్ 7న తెలంగాణ సీఎంగా పదవీ ప్రమాణం స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డి ప్రగతి భవన్‌ను ప్రజాభవన్‌గా మార్చారు. ప్రజాభవన్‌గా మార్చి అక్కడే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో మాత్రం నేటికి పాత ఆంక్షలే కొనసాగిస్తున్నారు. విద్యార్థులకు సమస్యలు చెప్పుకునే అవకాశం కూడా కల్పించడం లేదు. సీఎం రేవంత్ రెడ్డి నేరుగా బాసర ట్రిపుల్ ఐటీకి వచ్చి సమస్యలు తెలుసుకుని శాశ్వత పరిష్కారానికి మార్గం చూపుతారని ఇక్కడి విద్యార్థులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



2022 ఆగస్టు 7న ట్రిపుల్‌ఐటీ ప్రధాన ద్వారం వద్ద గవర్నర్ మీడియా సమావేశం (ఫైల్)

తీరిక లేక..

విద్యార్థులకు ప్రతీరోజు క్రీడలు ఆడుకునేలా షెడ్యూల్ ఉంచాలి. ఉదయం నిద్రలేవగానే రాత్రి పడుకునే వరకు స్నానాలు, భోజనాలు, తరగతి గదులు వీటితోనే రోజు పూర్తి అవుతుంది. క్రీడల్లో ఉన్న విద్యార్థులు మానసిక ఒత్తిడికి కాస్త దూరమవుతారు. వారంలో ఒక్కరోజైన చెవులకు ఇంపైనా సంగీతం, వినోద కార్యక్రమాలు తిలకించే ఏర్పాట్లు చేయాలి. అవేవి ఇక్కడ జరగడం లేదు. విద్యార్థుల పరిస్థితిపై ఎప్పటికప్పుడు సైకాలజిస్టులతో కౌన్సెలింగ్‌లు ఇప్పిస్తూ మానసికస్థితిని తెలుసుకోవాలి. ఒంటరిగా ఉండే విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులను పిలిచి గతంలో ఎలా ఉండేవారు. ఇప్పుడు ఎందుకు ఇలా ప్రవర్తిస్తున్నారనే విషయాలను చర్చించాలి. ఇకనైనా విద్యార్థులపై శ్రద్ధ వహించాలని పలువురు కోరుతున్నారు.

నేటి సీఎంకు అప్పట్లో నో ఎంట్రీ...



2022 జూన్ 17న అప్పటి పీసీసీ చీఫ్ నేటి సీఎం రేవంత్‌రెడ్డి(ఫైల్)

నేటి సీఎం రేవంత్‌రెడ్డికే అప్పట్లో బాసర ట్రిపుల్‌ఐటీలో అనుమతించ లేదు. విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు గోడ దూకివచ్చిన పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. మళ్లీ గేటుద్వారా బయటకు పంపించారు. ప్రస్తుతం ఆయన సీఎంగా కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సమస్య పరిష్కారం అవుతుందని విద్యార్థులు భావిస్తున్నారు.

జీఎంను కలిసిన పలువురు నేతలు



జీఎం సంజీవరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య

శ్రీరాంపూర్: నూతన సంవత్సరం పురస్కరించుకొని పలువురు యూనియన్ నేతలు శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జీఎం కార్యాలయంలో సోమవారం ఆయన్ను ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య, డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి సెక్రెటరీలు ఎస్కే బాజీసైదా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో కంపెనీ మంచి వృద్ధిని సాధించాలని అదే క్రమంలో కార్మికుల సమస్యలన్నీ పరిష్కారం కావాలని నేతలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య నాయకులు నర్సింగరావు, మురళీచౌదరి, అఫ్రోజ్‌ఖాన్, గండి సతీశ్, రాంచందర్ పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ నాయకులు..

ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షులు కలవేన శ్యాం, గరిగే స్వామి తదితరులు జీఎం సంజీవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ జాతీయ సమితి సభ్యుడు భీంరావు, నాయకులు వెంగళ కుమారస్వామి, నీలం సదయ్య, ల్యాగల శ్రీనివాస్, నర్సింగ్, కాలువ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్..

సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీఎం సంజీవరెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు , ఏరియా లైజన్ అధికారి కిరణ్‌కుమార్, అసోసియేషన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు నీలబోయిన కుమార్, నాయకులు రాజేంద్రపాణి, పి.బాపయ్య, రాజేంద్రప్రసాద్, నవీన్, మల్లేశ్ పాల్గొన్నారు.

రాకేశ్‌కు అందుతున్న ఆర్థికసాయం

సాక్షి ఎఫెక్ట్..

భైంసాటౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న రాకేశ్‌కు దాతల నుంచి ఆర్థిక సాయం అందుతోంది. ‘ఆపన్నహస్తం అందించరూ..’శీర్షికన ‘సాక్షి’లో సోమవారం ప్రచురితమైన కథనానికి పలువురు స్పందిస్తున్నారు. జిల్లా నుంచే కాకుండా ఆదిలాబాద్‌తోపాటు అమెరికా, దుబాయ్ నుంచి సైతం పలువురు తమకు తోచిన ఆర్థికసాయాన్ని ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా అందిస్తున్నారు. రాకేశ్ స్నేహితులు సామాజిక మాధ్యమాల ద్వారా సాయం అందించాలని దాతలను కోరుతున్నారు. ఇప్పటివరకు దాతల నుంచి రూ.4.50 లక్షల ఆర్థికసాయం అందినట్లు తెలిపారు. ఆపరేషన్ కోసం రూ.8 లక్షల వరకు అవసరమని వైద్యులు పేర్కొన్నారని, దాతలు మరింత స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న తూమోల్ల దత్తాత్రి

ఆర్కే 5 గనిలో కార్మికుడికి గాయాలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఆర్కే 5 గనిలో సపోర్టుమెన్ కార్మికుడు అంగడి సమ్మయ్యకు గాయాలయ్యాయి. మొదటి షిఫ్ట్ విధులకు హాజరైన సమ్మయ్య గని భూగర్భంలో విధులకు హాజరయ్యాడు. విత్‌డ్రాయింగ్ పనులు చేస్తున్నాడు. ఈక్రమంలో దిమ్మెలు తీస్తుండగా ఒక్కసారిగా పై నుంచి బండ కూలింది. బండ దిమ్మపై పడి తర్వాత అతనిపై పడటంతో కుడి భుజానికి గాయాలయ్యాయి. అతన్ని కార్మికులు రామకృష్ణపూర్‌లోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

‘ఎల్లలు దాటిన మానవత్వం’

జన్నారం: మానవత్వం ఎల్లలు దాటింది. మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన బరుకుంట పోషన్న గత 12 ఏళ్ల క్రితం ఉపాధి నిమిత్తం సౌదీకి వెళ్లాడు. అక్కడ రియాజ్ మహ్మద్ సైఫ్‌కు చెందిన కంపెనీలో కార్మికుడిగా చేరాడు. గత ఆరునెలల క్రితం పోషన్న స్వగ్రామానికి వచ్చాడు. ఈక్రమంలో అనారోగ్యం బారినపడ్డాడు. వైద్యపరీక్షల్లో క్యాన్సర్ అని తేలింది. ఈ విషయం తెలియడంతో రియాజ్ మహ్మద్ సైఫ్ అతని వైద్యఖర్చుల కోసం డబ్బులు పంపించారు. సోమవారం ఆయన కలమడుగుకు వచ్చి పోషన్నను పరామర్శించారు. తర్వాత గ్రామంలోని మసీద్‌లో ప్రార్థనలు చేశారు. మసీద్ మరమ్మతుకు ఆర్థికసాయం అందజేస్తానని తెలిపారు. ముస్లింలకు అనాథ పిల్లలకు రూ.12 వేల నగదు అందించారు. ఈ సందర్భంగా సైఫ్‌ను సాక్షి పలుకరించగా, ఏళ్లగా ఇంట్లో వ్యక్తిలా పనిచేసిన పోషన్నను పరామర్శించేందుకు ఇక్కడికి వచ్చానని తెలిపారు. మానవత్వం చాటిన సైఫ్‌ను గ్రామస్తులు అభినందించారు.



కలమడుగు గ్రామస్తులతో రియాజ్ మహ్మద్ సైఫ్

ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అభివృద్ధికి పాటుపడాలి

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అభివృద్ధికి పాటుపడాలని నాయకులు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని పిట్టల్‌వాడలో గల ఆదివాసీ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. విభేదాలు పక్కనపెట్టి అందరూ ఐక్యంగా ఉండాలన్నారు. అందులో భాగంగా మండల, డివిజన్ స్థాయి కమిటీలు నియమించాలన్నారు. ఫిబ్రవరిలో జరిగే హీరాసుక్కా జయంతి విజయవంతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈనెల 7న బేల, జైనథ్, 9న తాంసి, తలమడుగు, 11న ఆదిలాబాద్, గుడిహత్నూర్, 12న భీంపూర్ మండలాల కమిటీలను ఎన్నుకుంటామన్నారు.సమావేశంలో ఆదివాసీ పర్ధాన్ సమాజ్ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, విజయ్, దేవిదాస్, రామాకాంత్, శివకృష్ణ పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన అడహక్ కమిటీ సభ్యులు

అడహక్ కమిటీ ఎన్నిక..

ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. సభ్యులుగా పూసం ఆనంద్‌రావ్, కుర్సేంగే తానాజీ, నైతం శుక్లాల్, పూసం ప్రభాకర్, గేడం మాధవ్, సెడ్మకి సుభాష్, గేడం విఠల్, మెస్రం ఈశ్వర్, మడావి దిగంబర్, మెస్రం భాస్కర్, ఆత్రం అనుసూయ, గంగాదేవి ఎన్నికయ్యారు.

కౌన్సిలర్‌ను అరెస్ట్ చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల కేంద్రానికి చెందిన దళిత యువకుడు ఎంబడి వంశీ హత్యకు యత్నించిన పాల్పడిన కౌన్సిలర్ ఉష్కం రఘుపతి, ఉష్కం అరుంధతిలను అరెస్టు చేయాలని అంబేద్కర్ సంఘాల ఐక్యపోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని న్యూఅంబేద్కర్ భవనంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని దళిత కులాలతో కలిసి ఈనెల 3న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. 6న ఆదిలాబాద్ పట్టణ బంద్‌కు పిలుపునిస్తామన్నారు. 8న మంత్రులు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్లను కలిసి వినతిపత్రాలు అందిస్తామన్నారు. తాము చేపట్టే కార్యక్రమాలకు పోలీసులు సహకరించాలని కోరుతూ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందించారు. నిందితులను అరెస్ట్ చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. సమావేశంలో భూమన్న, నవీన్, నగేశ్, ప్రశాంత్, చందాల రాజన్న, దయాకర్, దేవిదాస్, సత్యనారాయణ, సుదర్శన్, శంకర్, చిన్నయ్య, శోబతాయి పాల్గొన్నారు.



ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు



అ‘పూర్వ’ సమ్మేళనం

కేక్ కట్ చేస్తున్న పూర్వ విద్యార్థులు

స్థానిక కుంటాల ఉన్నత పాఠశాలలో 2002–03 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు 21 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. సోమవారం నిర్వహించిన అపూర్వ సమ్మేళనంలో పాల్గొని రోజంతా సంతోషంగా గడిపారు. న్యూఇయర్ వేడుకల సందర్భంగా కేక్ కట్ చేశారు. పాఠశాలలో జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. – కుంటాల

శ్రీరాంపూర్‌లో 81 శాతం ఉత్పత్తి

- జీఎం బి. సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యంలో 81 శాతం ఉత్పత్తిని సాధించినట్లు ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్పత్తి వివరాలు, గత సంవత్సరం ఏరియా గనులు, సాధించిన ప్రగతిని వివరించారు. రెండు ఓసీపీల్లో ఓబీ టెండర్ సమస్యల వల్ల అనుకున్న బొగ్గు ఉత్పత్తి జరుగలేదన్నారు. భూగర్భ గనుల్లో 93 శాతం ఉత్పత్తి నమోదైందన్నారు. 2025–26 నాటికి ఎస్సార్పీ 1, ఆర్కే 6 గనులు మూతపడనున్నాయన్నారు. మిగిలిన ఆర్కే 5, ఆర్కే, ఐకే 1ఏ గనులు మరో ఐదేళ్ల వరకు బొగ్గు తీసే అవకాశం ఉందన్నారు. చెన్నూర్‌లో ఏర్పాటు చేస్తున్న 11 మెగావాట్ల సోలార్ ప్లాంట్ పనులు ఫిబ్రవరి నాటికి పూర్తవుతాయన్నారు. శ్రీరాంపూర్‌లో చెత్తశుద్ధి కోసం రూ.1.2 కోట్లతో ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీరాంపూర్ డివిజన్‌లో ఎస్సార్పీ 1 గనిని 5 స్టార్ రేటింగ్ వచ్చిందన్నారు. గత సంవత్సరం శ్రీరాంపూర్‌లో 384 మందికి డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించామన్నారు. 8201 మందికి ఇప్పటికి సీపీఆర్ఎంఎస్ కార్డులు ఇచ్చామన్నారు. సేవా సమితి ద్వారా పలు వృత్తి కోర్సుల్లో 473 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. బెల్లంపల్లి రీజియన్‌లో గడిచిన 2022–23లో ఒక్క ప్రమాదం జరగకుండా యాక్సిడెంట్‌ఫ్రీ రీజియన్‌గా గుర్తింపు పొందిందన్నారు. సమావేశంలో ఎస్ఓటూజీఎం రఘుకుమార్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవి, ఏజెంట్లు ఏవీరెడ్డి, రాముడు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంజీవరెడ్డి

ఎస్‌డీఎల్ ఉత్పత్తిలో ఆర్కే 6 అగ్రగామి..

అన్ని భూగర్భ గనుల్లో కెల్లా ఎస్‌డీఎల్ సెక్షన్‌లో ఉత్పత్తి సాధించిన ఆర్కే 6 గని అగ్రగామిగా నిలిచిందని గ్రూప్ ఏజెంట్ ఏ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం గనిపై జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు అధికారులు సూపర్‌వైజర్లు సమష్టితో రికార్డును నెలకొల్పామన్నారు. కొత్తగూడెంలో జరిగిన సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో కంపెనీ గని అధికారులు అందుకున్న బహుమతిని కార్మికుల ముందు ప్రదర్శించారు. గని మేనేజర్ తిరుపతి, రక్షణ అధికారి కాదాసి శ్రీనివాస్, ఫిట్ ఇంజనీర్ శ్యాం, వెంటిలేషన్ అధికారి రాంనర్సయ్య,డెప్యూటీ మేనేజర్ కొమురయ్య ఉన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తి పెంచాలని జీఎం మనోహర్ పేర్కొన్నారు. జీఎం ఆఫీస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. కేకే–5 గనిలో 18,939 టన్నులు, కాసిపేట గనిలో 14,558 టన్నులు, కాసిపేట–2 గనిలో 8,681 టన్నులు, శాంతిఖని గనిలో 6,014 టన్నులు, ఆర్కే ఓసీలో 176,259 టన్నులు, కేకే–ఓసీలో 162,751 టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగిందని వివరించారు. ఏరియాలో 118 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించిన ఆర్కే ఓసీ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్వో టూ జీఎం రాజేశ్వర రెడ్డి, పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్, ఐఈడీ రాజన్న కేకే–ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేశ్, సీనియర్ పీవో ఆసీఫ్ పాల్గొన్నారు.

నరేంద్రాచార్య మహారాజ్‌ను కలిసిన ఎమ్మెల్యే



నరేంద్రాచార్య మహారాజ్‌తో రామారావుపటేల్

భైంసాటౌన్: నానిజ్‌ధామ్ దక్షిణ భారత్ పీఠాధిపతి నరేంద్రాచార్య మహారాజ్‌ను ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ కలిశారు. జుక్కల్‌లో సోమవారం నిర్వహించిన సమస్య మార్గదర్శన, దర్శన సమారోహ సందర్భంగా ఎమ్మెల్యే ఆయన్ను కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు పలువురు ఉన్నారు.

నాలుగేళ్ల బాబు కిడ్నీల్లో రాళ్లు

నిర్మల్: వయసుతో సంబంధం లేకుండా కిడ్నీలో రాళ్లు తయారవుతున్నాయి. కేవలం నాలుగేళ్ల చిన్న వయసులోనే ఓ బాబు రెండు కిడ్నీల్లో రాళ్లు కావడంతో నొప్పి భరించలేక కొన్ని రోజులుగా విలవిలలాడిపోయాడు. సోన్ మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాబు కొంతకాలంగా కిడ్నీలో రాళ్లతో బాధపడుతున్నాడు. తెలిసిన వారి ద్వారా బాబును తీసుకుని తల్లిదండ్రులు జిల్లాకేంద్రంలోని డాక్టర్స్ లైన్‌లో గల స్వప్న హాస్పిటల్‌కు వచ్చారు. జనరల్ సర్జన్ శశికాంత్, కిడ్నీ వైద్య నిపుణుడు శ్రావణ్ బాబు రెండు కిడ్నీల్లో రాళ్లు ఉన్నట్లు గుర్తించి ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం బాబు ఆరోగ్యంగా ఉన్నాడని వారు చెప్పారు. ఇలాంటి కిడ్నీ సంబంధిత వ్యాధులకు, కార్పొరేట్ స్థాయిలో నిర్మల్‌లోనే చికిత్స పొందవచ్చని వైద్యుడు శశికాంత్ చెప్పారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి



హక్కారామ్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని రైల్వే ఫ్లెఓవర్ బ్రిడ్జిపై ఆదివారం రాత్రి ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందాడు. మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. ఎస్సై రాజేందర్ కథనం ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రం జోదాపూర్ జిల్లా జటనీయా గ్రామానికి చెందిన హక్కారామ్(20), మరికొందరు కలిసి ఉపాధి నిమిత్తం నాలుగేళ్ల క్రితం మంచిర్యాలకు వచ్చారు. హక్కారామ్ కబోడ్ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం సీసీసీలో పని ముగించుకున్నాడు. తెలిసిన వ్యక్తి బైక్‌ను తీసుకుని తనతో పనిచేసిన డుంగర్‌ను మంచిర్యాలలో దింపి తిరిగి వెళ్తున్నాడు. ఈక్రమంలో రాళ్లపేటకు చెందిన అన్వర్ వేగంగా వచ్చి బైక్ ఎదురెదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో హక్కారామ్ తలకు తీవ్రంగా, అన్వర్‌కు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హక్కారామ్ మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కమ్మేసిన పొగమంచు



లక్ష్మణచాంద: రాచాపూర్-మూటాపూర్ మార్గంలో..

లోకేశ్వరం మండలంలోని ధర్మోర, పంచగుడి, లోకేశ్వరం, వట్టోలి గ్రామాలు, లక్ష్మణచాంద మండలకేంద్రం, రోడ్డు మార్గాల్లో సోమవారం పొగమంచు కమ్మేసింది. పంట పొలాలు, రోడ్డు మార్గాల్లో దట్టమైన పొగ మంచు వల్ల వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 8 గంటల వరకు పొగమంచు తగ్గలేదు.

– లోకేశ్వరం/ లక్ష్మణచాంద



లక్ష్మణచాంద సమీపంలో..



లోకేశ్వరంలో..